## క్లుప్తంగా

### వైభవంగా ప్రతిష్ఠోత్సవాలు



ట్రాక్టర్‌లో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పాములపాడు: మండలంలోని మద్దూరు గ్రామంలో సోమవారం శ్రీదేవి, భూదేవి, వెంకటేశ్వరస్వామి సహిత సుంకులాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠోత్సవ పూజలు ప్రారంభించారు. ఉదయం నుంచి శాస్త్రోక్తంగా వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. మేళ తాళాలతో గ్రామంలోని పుర వీధుల్లో ట్రాక్టర్‌లో ఊరేగింపు నిర్వహించారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. విగ్రహాలకు కాయ, కర్పూరాలు సమర్పించి దర్శించుకున్నారు.

### కనుల పండువగా కల్యాణోత్సవం



కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నందికొట్కూరు: పట్టణంలోని సత్యనారాయణ స్వామి దేవాలయంలో సోమవారం సత్యనారాయణ స్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా బాజాభజంత్రీల మధ్య స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రవీంద్రబాబు, వేణుగోపాల్, బాబు, కృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### ఆరో రోజుకు చేరిన జలదీక్ష

జూపాడుబంగ్లా: మండ్లెం, తంగడంచ, భాస్కరాపురం గ్రామాల్లోని పొలాలకు తాటిపాడు ఎత్తిపోతల పథకం 1, 2 ద్వారా సాగునీటిని సరఫరా చేసి ఆదుకోవాలని రైతులు కోరారు. మండలంలోని మండ్లెం గ్రామంలో చేపట్టిన జలదీక్ష సోమవారం ఆరో రోజుకు చేరింది. పలువురు రైతులు మాట్లాడుతూ ఈ మూడు గ్రామాల పరిధిలో 5వేల ఎకరాల సాగుభూములున్నట్లు తెలిపారు. ఏటా సాగుచేసిన పంటలకు సాగునీరు అందక నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కష్టాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు, ప్రజాప్రతినిధులు తాటిపాడు ఎత్తిపోతల పథకం ద్వారా తంగడంచ, మండ్లెం, భాస్కరాపురం గ్రామాల్లోని పొలాలకు సాగునీరు అందేలా చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, ప్రసాద్, రవీంద్ర, నర్సన్న, ప్రభుదాసు, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

### వెలుగోడులో ఇందూ ధర్మ ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

వెలుగోడు: పట్టణంలో సోమవారం త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథముల ఇందూ ధర్మ ప్రచారం నిర్వహించారు. ఇందూ ధర్మ కమిటీ అధ్యక్షులు రామచంద్రుడు, కార్యదర్శి మునిదాసు మాట్లాడుతూ.. ఆది భారత దేశంలో ఆత్మజ్ఞానం కలవారిని (ఇందూ జ్ఞానం కలవారు అని) ఇందువులని, ప్రపంచ జ్ఞానం కలవారిని ఇంగిత జ్ఞానం కలవారని చెప్పేవారన్నారు. అందుకే ఇతర దేశాలు మన దేశాన్ని ఇందుత్వమును బోధించు దేశంగా ఇందూ దేశమని పిలిచారని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పుల్లారెడ్డి, కుమార్ ఆచారి, గొకరి, వెంకటేశ్వర్లు, సంజీవ, రమణ తదితరులు పాల్గొన్నారు.

### వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



క్రీడా శిబిరాన్ని ప్రారంభిస్తున్న పుల్యాల నాగిరెడ్డి

నందికొట్కూరు: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వేసవి ఖోఖో శిబిరాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి కర్నూలు జిల్లా ఖోఖో చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి, సర్పంచ్ పెరుమాల శేషన్న అన్నారు. సోమవారం పగిడ్యాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఖోఖో వేసవి శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పీఈటీ పీతాంబరరెడ్డి, రాఘన్న, రమణరావు పాల్గొన్నారు.

### రేపు సర్వసభ్య సమావేశం

వెలుగోడు : మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షేక్ అమానుల్లా తెలిపారు. ఎంపీపీ లాలం రమేష్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

# చెన్నకేశవస్వామి ఉత్సవాలకు వేళాయే

- నేటి నుంచి మిడుతూరులో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు
- 3న స్వామివారి కల్యాణం
- 5న రథోత్సవం

మిడుతూరు: మండల కేంద్రంలో వెలసిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 2వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 6వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి.

**నేడు మహాగణపతి పూజ**

మంగళవారం రాత్రి 9 గంటలకు శ్రీ మహాగణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అనంతరం శ్రీ చక్రరాజపూజ, నవగ్రహ మండపపూజ నిర్వహి స్తారు. 3న తెల్లవారుజామున 5.20గంటలకు శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణం, ఉదయం 8 గంటలకు శేషవాహన సేవ, రాత్రి 7.30 గంటలకు హనుమత్ ఉత్సవ కార్యక్రమం, 4న ఉదయం 8 గంటలకు సింహవాహన సేవ, రాత్రి 7.30గంటలకు గరుడోత్సవ కార్యక్రమం, 5న ఉదయం రథాంగహోమం, పూర్ణాహుతి కార్యక్రమం, సాయంత్రం 5.30 గంటలకు రథోత్సవ కార్యక్రమం, 6న ఉదయం తీర్థావళి, పూర్ణాహుతి కార్యక్రమం, సాయంత్రం 5.30 గంటలకు పారువేట ఉత్సవ కార్యక్రమంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగిస్తాయని ఆలయ కార్యనిర్వహణ అధికారి గుర్రెడ్డి తెలిపారు.. స్వామివారి బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాలొనే అవకాశం ఉండటంతో అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేశారు.



శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయం (ఇన్‌సెట్) స్వామివారి మూలవిరాట్

**సాంస్కృతిక కార్యక్రమాలు**

బ్రహ్మోత్సవాల సందర్భంగా 2వ తేది దేవాలయానికి విద్యుద్దీపాలంకరణ, పూలాలంకరణ, శ్రీ నడిపి రాజన్న బృందంవారిచే మంగళవాయిద్యాలు, 4న రాత్రి 9 గంటలకు గుండు పందెం, చందా, కాడిపట్లు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5న 9 గంటలకు ఆర్కెస్ట్రా , 6వతేదీ రాత్రి 9 గంటలకు రేలారే రేలా దుమ్మురేపు జానపద ఆటపాట తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

**5న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు**

ఉత్సవాల సందర్భంగా రాష్ట్రస్థాయి న్యూ కేటగిరీ విభాగంలో బండలాగుడు పోటీలను ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి ఆధ్వర్యంలో మే 5 వతేది శుక్రవారం ఉదయం 8 గంటలకు ప్రారంభిస్తున్నట్లు నిర్వహకులు సోమవారం తెలిపారు. పోటీల్లో విజేతలైన ఎడ్ల యాజమానులకు వరుసగా రూ. 50 వేలు, 40 వేలు, 30 వేలు, 20 వేలు, 15 వేలు, 10 వేలు, 5 వేలు నగదును అందజేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా బహుమతి రాని ప్రతి జతకు రూ. 3 వేలు కన్‌సోలేషన్ బహుమతిగా అందజేస్తామని తెలిపారు. ఆసక్తి కల ఎడ్ల యజమానులు ఎంట్రీ ఫీజు రూ. 600 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు.



ఉత్సవానికి సిద్ధమవుతున్న రథం

**జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు**

మే 5వ తేదిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఈ పోటీల్లో విజేత జట్లకు వరుసగా రూ. 20 వేలు, రూ. 15 వేలు, రూ. 10 వేలు, రూ. 5 వేలు, రూ. 4 వేలు, రూ. 3 వేలు నగదును అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కల జట్లు ఎంట్రీ ఫీజు రూ. 400 చెల్లించి జట్టు పేరును 4వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8008663446, 6303354390, 9908888224, 9441808624 సంప్రదించవలెనని తెలిపారు.

# చిరుధాన్యాలు ఆరోగ్యకరం



వెలుగోడులో జొన్నల పంపిణీని ప్రారంభిస్తున్న ఎంపీపీ లాలం రమేష్

పాములపాడు: చిరుధాన్యాలు ఎంతో ఆరోగ్యకరమని తహసీల్దార్ రత్నరాధిక అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని రేషన్ కార్డు లబ్ధిదారులకు జొన్నలు ఉచితంగా పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించే క్రమంలో ఉచితంగా రాగులు, జొన్నలు పంపిణీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచు మేకల భాగ్య మ్మ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు చౌడయ్య, కో ఆప్షన్ సభ్యుడు ముర్తుజావలి, వీఆర్వో ముర్తుజావలి, చౌక దుకాణం డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడు: పట్టణంలో జొన్నల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఎంపీపీ లాలం రమేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో వెలుగోడు సర్పంచ్ వేల్పుల జైపాల్, జెడ్పీ కో ఆప్షన్ నెంబర్ సయ్యద్ సులేమాన్, వైస్ ఎంపీపీ శంకర్ నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు రామ్మోహన్ రెడ్డి, ఎంపీటీసీ రాజేష్, బాషా, తెలుగు రమణ తదితరులు పాల్గొన్నారు.

మహానంది: మహానందిలో సోమవారం రేషన్‌కార్డు దారులకు జొన్నల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని ప్రారంభించారు. మహానంది దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, సర్పంచ్ చలంచలం శిరీష, తహసీల్దార్ జనార్దన్‌శెట్టి, తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం చిరుధాన్యాలు పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ రాజశేఖర్‌బాబు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని 10బొల్లవరం గ్రామంలో రాగులు, జొన్నలు రేషన్‌కార్డు దారులకు పంపిణీ చేశారు.

జూపాడుబంగ్లా: ప్రతి రేషన్‌కార్డు దారునికి కిలో జొన్నలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 12 గ్రామపంచాయతీల్లో 11,756 రేషన్‌కార్డులుండగా వారికి 117.56 క్వింటాళ్ల జొన్నలు మంజూరైనట్లు తెలిపారు. ఇంటింటికి రేషన్‌సరుకులను పంపిణీ చేసే ఎండీయూ వాహనం దారుని వద్ద రేషన్ సరుకులతో పాటు కిలో జొన్నలను ఉచితంగా పొందవచ్చునన్నారు.

### ఘనంగా దేవాలయ పునఃప్రతిష్ఠ

నందికొట్కూరు: పగిడ్యాల మండలంలోని సంకిరేణిపల్లె గ్రామంలో సుంకులమ్మ దేవాలయ పునఃప్రతిష్ఠ వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 5వ తేదీ వరకు సుంకులమ్మ దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ ప్రతిష్ఠ వేడుకల సందర్భంగా భక్తులు అభిషేకాలు, యాగాలు, హోమాలు నిర్వహించారు.

## ఆధ్యాత్మికం

### శ్రీశైలంలో భక్తుల రద్దీ

శ్రీశైలంటెంపుల్: శివునికి అత్యంత ప్రీతికరమైన సోమవారం నేపథ్యంలో శ్రీశైల క్షేత్రానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులతో క్షేత్రంలోని పురవీధులు, ఆలయ క్యూలైన్లు కిక్కిరిసాయి. వేకువ జామునే పవిత్ర పాతాళగంగలో పుణ్యస్నానాలాచరించుకోవడానికి తరలి రావడంతో స్నాన ఘట్టాలు భక్తులతో కిటకిటలాడుతూ కనిపించాయి. భక్తుల సౌకర్యార్థం ఆలయాధికారులు క్యూలలో వేచి ఉన్న భక్తులకు మంచినీరు, అల్పాహారాన్ని ఉచితంగా అందజేశారు.



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రధాన క్యూ

# పల్లకీలో విహరించిన మహానందీశ్వరుడు



మహానందిలో పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: శ్రీ గంగా, శ్రీ కామేశ్వరీదేవి సమేత మహానందీశ్వరస్వామి వార్లు సోమవారం రాత్రి పల్లకీలో కొలువై ఆలయ ప్రాకారాల్లో విహరించారు. వేదపండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. ముక్కోటిదేవతలకు నిలయమైన గోమాతను పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకీ ముందు ఉంచి ఉత్సవాన్ని జరిపారు.

### మల్లన్న సన్నిధిలో ఎమ్మెల్సీ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలశ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను సోమవారం అనంతపురానికి చెందిన ఎమ్మెల్సీ శివరామిరెడ్డి దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం అధికారులు, అర్చకులు ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వీరు స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకుని, విశేషపూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు అందించగా అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలను అందజేశారు.



ఎమ్మెల్సీ శివరామిరెడ్డికి వేదాశీర్వచనం చేస్తున్న అర్చకులు

### విద్యుత్‌షాక్‌తో బర్రెలు మృతి

మహానంది: మేతకు వెళ్లిన బర్రెలు, ఆవు విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన ఘటన సోమవారం సీతారామాపురంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నీరుకట్టు వెంకటరాముడు బర్రెలు, ఆవులు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో వాటిని మేపేందుకు సమీపంలోని పంట పొలాలకు వెళ్లాడు. అక్కడ విద్యుత్ తీగలు తగలడంతో మూడు పాడి బర్రెలు, ఒక ఆవు మృతి చెందినట్లు బాధితుడు తెలిపాడు. దీంతో సుమారు రూ. రెండు లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని చెప్పాడు.

### బ్రిడ్జి కమ్ బ్యారేజీ నిర్మిస్తే సీమకు ప్రయోజనం

శ్రీశైలం ప్రాజెక్ట్: కృష్ణానదిపై తీగల వంతెనకు బదులు బ్రిడ్జికమ్ బ్యారేజీ నిర్మిస్తే రాయలసీమ రైతాంగానికి ప్రయోజనకరంగా ఉంటుందని రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్, బీజేపీ నాయకుడు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. రాయలసీమ స్టీరింగ్ కమిటీ విస్తృత స్థాయి సమావేశాన్ని సోమవారం సాయంత్రం స్థానిక కృష్ణవేణి కల్యాణ మండపంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కృష్ణానదిపై సిద్దేశ్వరం వద్ద కేంద్ర ప్రభుత్వం తీగలవంతెన నిర్మాణాన్ని ఆమోదించిందని, తీగల వంతెనకు బదులు బ్రిడ్జికమ్ బ్యారేజీ నిర్మిస్తే నీరు వృథా కాకుండా నిల్వ చేసుకుని రాయలసీమ రైతాంగానికి నీటిని అందించే వీలుందన్నారు. అలాగే శ్రీశైలజలాశయం ముప్పు బారిన పడకుండా కాపాడుకోవచ్చన్నారు. స్టీరింగ్ కమిటీ ఈ నెల 7వ తేదీ నుంచి సంతకాల సేకరణ కార్యక్రమం చేపడుతుందని చెప్పారు.

# పింఛన్ల పంపిణీలో ప్రథమం



జూపాడుబంగ్లాలో తెల్లవారకముందే సుబ్బమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీరు మహబూబ్‌బాషా



కర్నూలు ఆసుపత్రిలో సామక్కకు పింఛన్ అందజేస్తున్న గ్రామ వలంటీర్ చిన్న స్వామన్న

- జూపాడుబంగ్లా మండలంలో తొలిరోజు 85.09 శాతం పంపిణీ
- తెల్లవారకముందే అవ్వాతాతల చేతికి నగదు

జూపాడుబంగ్లా: వలంటీర్లు తెల్లవారకముందే తలుపుతట్టి పింఛన్ నగదు చేతిలో పెడుతూ వృద్ధులు, వితంతువులు, వికలాంగుల మోములో ఆనందం వెల్లివిరిసేలా చేస్తున్నారు. సోమవారం ఒకటోతేదీ కావడంతో వలంటీర్లు తెల్లవారుజామునే పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. జూపాడుబంగ్లా మండలంలో తొలిరోజే 85.09 శాతం మందికి పింఛన్లు అందజేసి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారు. మే మాసానికిగాను మండలంలోని 12 గ్రామపంచాయతీల్లో 5,024 మందికి పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ మంజులవాణి తెలిపారు. మధ్యాహ్నం 1.30గంటల ప్రాంతానికే వలంటీర్లు 4,275 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. మిగిలిన 749 మందికి మంగళవారం సాయంత్రంలోగా పంపిణీచేసి వందశాతం పింఛన్ల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు ఎంపీడీఓ వెల్లడించారు.

**కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత**

మిడుతూరు: మండల పరిధిలోని వీపనగండ్ల సచివాలయ పరిధిలోని బోరిల్లి సామక్క చెయ్యి విరిగి కర్నూలు జనరల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ చిన్న స్వామన్న కర్నూలుకు వెళ్లి నగదును అందజేశారు. అదేవిధంగా చౌట్కూరు గ్రామ సచివాలయ పరిధిలోని గుడిపాడు గ్రామానికి చెందిన లక్ష్మీదేవి అనారోగ్యానికి గురై గత కొంత కాలం నుంచి కర్నూలు జనరల్ హాస్పిటల్ చికిత్స పొందుతోంది. గ్రామ వలంటీర్ శ్రీనివాసులు హాస్పిటల్‌కు చేరుకొని పింఛన్ అందజేశాడు.

# హోరాహోరీగా గుర్రం పోటీలు

మిడుతూరు: శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాల సందర్భంగా సోమవారం గుర్రం పోటీలు హోరాహోరీగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి 13 గుర్రాలు పాల్గొన్నట్లు నిర్వహకులు తెలిపారు. పోటీలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. పోటీల్లో కర్నూలు పట్టణానికి చెందిన చాంద్‌బాషా గుర్రం ప్రథమ స్థానంలో నిలిచి 25 తులాల వెండి, నందికొట్కూరు తాలుకా అల్లూరు గ్రామానికి చెందిన గఫూర్‌మియ్య గుర్రం రెండో స్థానంలో నిలిచి 20 తులాల వెండి, మిడుతూరు మండలం వీపనగండ్ల గ్రామానికి చెందిన బడేబాషా మూడో స్థానంలో 15 తులాల వెండి గెలుచుకున్నాయి. మిడుతూరుకు చెందిన ముర్తుజావలి గుర్రం నాల్గవ స్థానంలో నిలిచి 10 తులాల వెండి, నందికొట్కూరు పట్టణానికి చెందిన ఎస్ గౌస్ గుర్రం ఐదవ స్థానంలో నిలిచి 5 తులాల వెండిని దక్కించుకున్నాయి. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కాతా రామచంద్రారెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ కాతా రమేష్‌రెడ్డి, కాతా రాజశేఖర్‌రెడ్డి, బన్నూరు సర్వోత్తమరెడ్డి, బ న్నూరు రామక్రిష్ణారెడ్డి, జయరాం యాదవ్, రామ్మోహన్, ముర్తుజావలి, తదితరులు పాల్గొన్నారు.



పోటీలో పరిగెడుతున్న గుర్రం

**ఆటో రివర్స్ పందెములు ...**

ఆటో రివర్స్ పందెములలో లింగస్వామి ప్రథమ స్థానంలో నిలిచి రూ.3వేలు, రంగన్నగారి బాలక్రిష్ణ రెండో స్థానంలో నిలిచి రూ.2 వేలు, మూడో స్థానంలో మొల్ల మాబాషా, బోయ వెంకటేష్ సమానంగా నిలిచి రూ 1000 దక్కించుకున్నారు.

# ఘనంగా మే డే వేడుకలు

నందికొట్కూరు: కార్మికులు, కర్షకులు తమ హక్కుల సాధనకై ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో మే డేను ఘనంగా నిర్వహించారు. జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పక్కీర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడు: పట్టణంలో సీఐటీయూ కార్యాలయంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే రామదాసు జెండాను ఎగురవేశారు. ఇసుక లోడింగ్ అన్లోడింగ్, ట్రాలీ ఆటో, పట్టణంలోని ఆటో స్టాండ్‌ల వద్ద సీఐటీయూ మండల అధ్యక్షుడు వి నాగమోహన్, స్వచ్ఛ భారత్ స్టేట్ డైరెక్టర్ బి ఫాతిమా, వెలుగోడు ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ జయపాల్, యూటీఎఫ్ జిల్లా నాయకులు రామకష్ణ తదితరులు సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు.

జూపాడుబంగ్లా: మే డేను పురస్కరించుకొని సోమవారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కర్ణ, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జూపాడుబంగ్లా, పారుమంచాల గ్రామాల్లో ఎర్ర జెండాలను ఆవిష్కరించారు.



నందికొట్కూరులో జెండాను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

కొత్తపల్లి: మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో సోమవారం ఏపీ వ్యవసాయకార్మిక సంఘం జిల్లా సహాయకార్యదర్శి స్వాములు,సీఐటీయూ నాయకులు దాసు, హరిత, సీపీఐ నాయకులు వెంకటశివుడు ఆధ్వర్యంలో మేడే ను ఘనంగా నిర్వహించారు. ఆయా కార్మిక సంఘాల జెండాలను ఆవిష్కరించారు.

శ్రీశైలంప్రాజెక్ట్: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శ్రీశైలం ప్రాజెక్ట్‌లో కార్మికులు భారీ సంఖ్యలో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలోని కార్మిక నేత టి.జనార్దన్‌రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఐఎఫ్‌టీయూ నాయకులు వెస్ట్ న్‌కాలనీలో కార్మిక జెండాను ఎగురవేశారు.

బండిఆత్మకూరు: స్థానిక మార్కెట్ యార్డ్‌లో సీఐటీయూ నాయకులు రత్నమయ్య, రామచంద్రుడు ఆధ్వర్యంలో మే డే కార్యక్రమం నిర్వహించారు.

ఆత్మకూరు: పట్టణంలోని గౌడ్‌సెంటర్ , పాతబస్టాండ్‌తో పాటు దాదాపు 10 కూడళ్లల్లో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, కార్యదర్శిరణధీర్, పట్టణఅధ్యక్ష, కార్యదర్శులు రజాక్, రామ్‌నాయక్ ఆధ్వర్యంలో జెండాను ఎగురవేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు అతావుల్లా, చాంద్‌బాషా నేతృత్వంలో ఆయా కూడళ్ల వద్ద మేడే నిర్వహించారు. నంద్యాల టర్నింగ్ వద్ద టూవీలర్‌మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ టూ వీలర్ మెకానిక్ అసోసియోషన్ గౌరవాధ్యక్షుడు షేక్‌మహబూబ్‌బాషా, రాజశేఖర్, అబివుల్లా, రాముడు పాల్గొన్నారు. ఏపీఎస్సార్‌టీసీ డిపో వద్ద ఆర్టీసీ కార్మిక యూనియన్ల నాయకులు జెండా ఎగురవేశారు.

# కుండపోత వర్షం

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- జూపాడుబంగ్లాలో అత్యధికంగా 77.2 మిల్లీమీటర్ల వర్షం
- ఒక్కరోజులోనే సాధారణం కంటే అధికంగా నమోదు

జూపాడుబంగ్లా: సోమవారం తెల్లవారుజామున నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా, నందికొట్కూరు, పాములపాడు, పగిడ్యాల, పాములపాడు, కొత్తపల్లి మండలాల్లో కుండపోత వర్షం కురిసింది. జూపాడుబంగ్లా మండలంలోని వివిధ గ్రామాల్లో కురిసిన వర్షం 77.2మిల్లీ మీటర్లుగా నమోదైనట్లు ఏఎస్‌ఓ హనుమంతు తెలిపారు. నియోజకవర్గంలోని జూపాడుబంగ్లాలో అత్యధికంగా 77.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా మిడుతూరులో అత్యల్పంగా 36.2మిల్లీ మీటర్ల వర్షం కురువగా, నందికొట్కూరులో 72.6ఎం.ఎం, కొత్తపల్లిలో 50.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది.

**సాధారణం కంటే అధిక వర్షం**

మే మాసం అనగానే ఎండల తీవ్రత, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతుంటారు. అలాంటిది మే నెల ప్రారంభంలోనే భారీ వర్షం కురవటంతో ఈ నెలలో కురవాల్సిన సాధారణ వర్షం కంటే అధిక వర్షపాతం ఒక్కరోజులోనే నమోదైంది.

**పొంగిపొర్లిన వాగులు, వంకలు**

సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి మండలంలోని ఇసుకవాగు, ఎర్రవాగు, సుద్దవాగు, కాకిలేరువాగులు పొంగిపొర్లాయి. పొలాల్లో వర్షపు నీటి నిల్వలు పేరుకుపోయాయి. మండలకేంద్రమైన జూపాడుబంగ్లాలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో వర్షపు నీరు నిలిచాయి.

**కొత్తపల్లిలో భారీ వర్షం**

కొత్తపల్లి: ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు మండలంలో భారీ వర్షం కురిసింది. మండలంలోని ఎర్రమఠం, ముసలిమడుగు, శివపురం, కొక్కెరంచ, దుద్యాల, గువ్వలకుంట్ల గ్రామాలతో పాటు మండల కేంద్రంలో 50 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని ఏఎస్‌ఓ రమేష్ తెలిపారు. భారీ వర్షానికి గువ్వలకుంట్ల, వీరాపురం గ్రామాలలోని ఎస్సీ కాలనీలోని రోడ్లపై వర్షపు నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షం వేసవి దుక్కులు దున్నుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నదాతలు చెబుతున్నారు. కాగా బొప్పాయి, అరటి, మునగ రైతులు పంటలు దెబ్బ తింటాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వీరాపురం గ్రామ సమీపంలో పొలంలో నిలిచిన వర్షపు నీరు



పెద్దదేవళాపురంలో దెబ్బతిన్న వరిపంట

**40.8 మిల్లీ మీటర్ల వర్షపాతం**

పాములపాడు: మండలంలో సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షం 40.8మిల్లీ మీటర్లుగా నమోదైనట్లు తహసీల్దార్ రత్నరాధిక తెలిపారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షం వల్ల నేలలు వేసవి దుక్కులకు అనుకూలమయ్యాయని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికే కొందరు పొలాల్లో దుక్కులకు సైతం సిద్ధమవుతున్నారు. కాగా ఆరుబయట ప్రాంతాల్లో ఆరబోసిన మిరప రైతులకు ఈ వర్షం కన్నీళ్లను మిగిలిస్తోంది.

**నేలకొరిగిన వరిపంట**

బండిఆత్మకూరు: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షానికి శింగవరం, చిన్నదేవళాపురం, పెద్దదేవళాపురం, సంతజూటూరు గ్రామాల్లో సుమారు 400 ఎకరాల్లో వరిపంట నేలకొరిగింది. ప్రస్తుతం పంట చేతికొచ్చే దశలో నేలకొరగడంతో ఎకరాకు పది బస్తాలు దిగుబడులు తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కల్లాల్లో ఉన్న ధాన్యం కూడా కొన్ని చోట్ల తడిసి పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంట నష్టపరిహారం అంచనా వేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

**సున్నిపెంటలో 80.4 మిమీ వర్షం**

శ్రీశైలంప్రాజెక్ట్: గత మూడు రోజులుగా శ్రీశైలం మండలంలో వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం భారీగా వర్షం కురిసింది. మండలంలో 80.4 మిమీ వర్షం కురిసినట్లు రికార్డుల్లో నమోదైంది. భారీగా వర్షాలు కురవడంతో రోడ్లపైకి నీళ్లు వచ్చి చేరాయి.

### ఎలుగుబంటి దాడి బాధితుడికి పరిహారం

బండిఆత్మకూరు: నారాయణాపురం గ్రామానికి చెందిన ఓ యువకుడు ఎలుగుబంటి దాడిలో గాయపడిన కరిముల్లాకు అటవీ అధికారులు సోమవారం రూ. 37 వేలు పరిహారం అందజేశారు. ఇటీవల అడవిలోకి వెళ్లిన అతనిపై ఎలుగుబంటి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో ప్రభుత్వం అతనికి పరిహారం మంజూరు చేసింది. ఈ మేరకు డీఎఫ్‌ఎఫ్‌వో వినిత్ కుమార్, ఎఫ్ఆర్‌ఓ నాసిర్‌ఝా ఆధ్వర్యంలో బాధితునికి చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు వెంకటమ్మ, ఎఫ్‌బీవోలు మదార్‌సా, హైమావతి తదితరులు పాల్గొన్నారు.



బాధితుడికి చెక్కును అందజేస్తున్న డీఎఫ్‌ఓ వినిత్ కుమార్